క్లుప్తంగా

ఘనంగా ఉగాది సప్తాహ వేడుకలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కురిచేడు: ఉగాది సప్తాహ వేడుకలు స్థానిక శ్రీ కోనవల్లభ రాయస్వామికొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. సూరే సత్యానారాయణ దంపతులు, కొప్పురావూరి మోహన్ రావు దంపతులు, భక్తులు సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

రోడ్డు వెంట చిల్లచెట్ల తొలగింపు



చిల్లచెట్లు తొలగిస్తున్న జేసీబీ

దొనకొండ: ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా గతంలో దొనకొండ వచ్చిన కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, డీపీఓ జీవీ నారాయణరెడ్డికి రోడ్డు వెంట చెట్లు తొలగించాలని బాదాపురం గ్రామస్తులు విన్నవించారు. సోమవారం పంచాయతీ సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్ ఆదేశాల మేరకు కార్యదర్శి పి.కృష్ణమూర్తి చిల్ల చెట్లు తొలగించే కార్యక్రమం చేపట్టారు. గ్రామాన్ని పరిశుభ్రంగా చేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

పాఠశాలలకు ఫైర్ ఎగ్జిస్టింగ్ సిలిండర్ల పంపిణీ

యర్రగొండపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఫైర్ ఎగ్జిస్టింగ్ సిలిండర్లు అందజేసింది. మండలంలోని 68 ప్రభుత్వ పాఠశాలలకు ఫైర్ ఎగ్జిస్టింగ్ సిలిండర్లు పంపిణీ చేశామని ఎంఈఓ పి.ఆంజనేయులు సోమవారం తెలిపారు. సిలిండర్లు వినియోగించే విధానంపై త్వరలోనే నిపుణులతో ఉపాధ్యాయులకు వివరించే విధంగా చర్యలు చేపట్టామని ఎంఈఓ పేర్కొన్నారు.

అందుబాటులో ఇసుక

దొనకొండ: జగనన్న కాలనీలు నిర్మించుకునే లబ్ధిదారులకు స్థానిక ఎఫ్‌సీ గోడౌన్‌లో ఇసుక అందుబాటులో ఉందని హౌసింగ్ సిబ్బంది తెలిపారు. సోమవారం లబ్ధిదారులు రశీదులు పొంది ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసుకున్నారు. ఇక నుంచి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, నాణ్యమైన ఇసుక అందిస్తామన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలని హౌసింగ్ సిబ్బంది సూచించారు.

మహిళా పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

ముండ్లమూరు: గ్రామాలో మహిళా పోలీసులు బాధ్యతగా పనిచేస్తే సమస్యలు అక్కడే పరిష్కారం అవుతాయని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలపై దృష్టి పెట్టాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని గుర్తించాలన్నారు. మహిళలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలి

దొనకొండ: విద్యార్థులకు అర్థం అయ్యే రీతిలో బోధించి అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి రికార్డులో నమోదు చేయాలన్నారు. 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడిగా అబ్దుల్ హై

పొదిలి: యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులుగా అబ్దుల్‌హై ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలు వేమూరి కల్యాణ మండపంలో జరిగిన యూటీఎఫ్ 48వ కౌన్సిల్ సమావేశంలో హైను ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు, నాయకులు, జేవీ నాయకులు అబ్దుల్ హైని అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

మార్కాపురం టౌన్: హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీపీఐ నేత అందె నాసరయ్య సోమవారం ప్రారంభించారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షురాలు కె.సరస్వతి, కాపు సంఘ నాయకులు తిరుమలశెట్టి వీరయ్య, బెల్లంకొండ భారతి, సంస్థ ప్రతినిధులు చెన్నుపల్లి కాశయ్య, అంజిరెడ్డి, నాగార్జునగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం..గురుకుల పాఠశాలలు



గురుకుల పాఠశాల ప్రాంగణం



స్టడీ అవర్‌లో చదువుతున్న విద్యార్థినులు

- ప్రవేశం దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 24న
- వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష

మార్కాపురం: గురుకుల పాఠశాలలో సీటు సాధిస్తే ఉన్నత స్థాయికి వెళ్లొచ్చనే నమ్మకం విద్యార్థుల్లో ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24 ఆఖరు తేదీగా ప్రభుత్వం ప్రకటించింది. 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు సాఘింక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు గురుకుల పాఠశాలలో సీటు ఒక వరం లాంటిది. ఒక్కసారి జాయిన్ అయితే ఇంటర్ వరకు ఉచితంగా నాణ్యమైన విద్య పొందవచ్చు.

దరఖాస్తు ఇలా..

హెచ్‌టిటిపిఓఆర్ // ఏపిఎఫ్‌పిసిఈటి.ఎపీ.సీఎఫ్‌ఆర్ ఆర్. ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంట్రెన్స్ టెస్టులో వచ్చే మార్కుల ఆధారంగా గురుకుల పాఠశాలలో సీటు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. మిగిలిన విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31లోపు జన్మించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం ఏడాదికి లక్షకు మించి ఉండకూడదు.

జిల్లాలో గురుకుల పాఠశాలలు

రాయవరం, దూపాడు, కురిచేడు, వెలుగొండ, చీమకుర్తి, సింగరాయకొండ, రాచర్లలో గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో 5వ తరగతికి 80, ఇంటర్మీడియెట్‌కు 80 సీట్లు ఉన్నాయి. ఇంటర్‌లో ప్రవేశానికి 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 17 నిండి ఉండాలి. పరీక్ష విధానంలో భాగంగా ఇంగ్లిష్‌లో 15, సోషల్ 15, గణితంలో 25, ఫిజికల్ సైన్స్‌లో 15, బయాలజీలో 15, లాజికల్ రీజనింగ్‌లో 15 ప్రశ్నలు ఉంటాయి.

విద్యార్థులకు ఉపయోగం



గురుకుల పాఠశాలలో సీటు వచ్చిన విద్యార్థికి ఉన్నత స్థాయిలో శిక్షణ ఇస్తాం. ఈ ఏడాది నుంచి సీబీఎస్సీ సిలబస్ కూడా బోధిస్తున్నాం. జూనియర్ ఇంటర్ విద్యార్థుల్లో కేవీఎల్ఎస్ (క్వైల్స్) శిక్షణ ఇస్తున్నాం. ఇందులో సెలెక్ట్ అయిన వారికి అమెరికాలో కొన్ని నెలల పాటు చదువుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మా విద్యార్థిని అమెరికాలో శిక్షణ పొందుతోంది. 8వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ కంప్యూటర్లు, జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నాం. నాణ్యమైన చదువుతో పాటు మంచి ఆహారం కూడా పెడుతున్నాం. విద్యార్థులు పరీక్ష రాసి సెలెక్ట్ అయితే మంచి విద్యార్థిగా తీర్చిదిద్ది పంపుతాం.

– ఆశాలత, ప్రిన్సిపాల్, రాయవరం గురుకుల పాఠశాల

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కేపీ



మంత్రులు మేరుగ నాగార్జున, తానేటి వనితలతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మార్కాపురానికి వచ్చిన మంత్రులు తానేటి వనిత, మేరుగ నాగార్జున, డాక్టర్ ఆదిమూలపు సురేష్‌లను కలిసి పలు విషయాలపై చర్చించారు. ముగ్గురు మంత్రులను ఆదివారం అర్ధరాత్రి మార్కాపురంలో కలిసి మార్కాపురం అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, ఉత్తమ్‌కుమార్, చాతరాజుపల్లి శ్రీనివాసులు ఉన్నారు.

కాశీనాయన ఆలయానికి వంట సామగ్రి అందజేత



వంట సామగ్రి అందజేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అభిమాని వై.బాలు, మిత్ర బృందం ఆర్థిక సహాయంతో మండలంలోని ముండ్లపాడు రోడ్డులో గల కాశీనాయన ఆలయానికి సోమవారం వంట సామగ్రి అందజేశారు. మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి చేతుల మీదుగా ఆలయ నిర్వాహకుడు చిన్న సుబ్బారాయుడుస్వామిజీకి వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు మాట్లాడుతూ బాలు మిత్రులు నరసరావుపేటకు చెందిన వారైనప్పటికీ కాశీనాయన ఆలయానికి ఉపయోగపడే వస్తువులు అందజేయడం చాలా ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఓబులరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచిగా మారం బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న సర్పంచి మారం ఇంద్రసేనారెడ్డి

తాళ్లూరు: విఠలాపురం సర్పంచిగా మారం ఇంద్రసేనారెడ్డి సోమవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. పంచాయతీలో బిల్లుల చెల్లింపులో ఏర్పడిన వివాదంలో కోర్టు ఆదేశాల మేరకు మూడు నెలల పాటు ఆయన్ను అధికారులు సస్పెండ్ చేశారు. తన వివరణ తీసుకోకుండా తనను పదవి నుంచి సస్పెండ్ చేయడం అన్యాయమంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. ఆయన్ను సర్పంచ్‌గా తదుపరి కోర్టు ఆదేశాలు వచ్చే వరకు కొనసాగించాలని కలెక్టర్ ఈ నెల 14న ఆదేశాల జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం సర్పంచిగా తిరిగి బాధ్యతలు చేపట్టి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై చర్చించారు. నిత్యం ప్రజల కష్టాలు తెలుసుకుంటూ విఠలాపురం, రమణాలవారిపాలెంలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. కొందరు కావాలనే తనపై లేని పోని ఆరోపణలు చేశారని, న్యాయపరమైన పోరాటం సాగిస్తానని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యదర్శి నూరుల్లా, మాజీ సర్పంచి విజయరాజు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

స్వీపర్ల జీతాలు చెల్లించేందుకు చర్యలు



స్వీపర్లతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శోభన్‌బాబు

కురిచేడు: గ్రామ పంచాయతీ స్వీపర్లకు జీతాలు చెల్లించేందుకు వెంటనే చర్యలు చేపడతామని డీఎల్‌పీఓ శోభన్‌బాబు హామీ ఇచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీలో స్వీపర్లుగా పనిచేస్తున్న 16 మంది, స్వచ్ఛ భారత్ కింద పనిచేస్తున్న 11 మంది జీతాలు వెంటనే చెల్లించాలని విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా పంచాతయతీ అధికారి నారాయణరెడ్డి డీఎల్‌పీఓ శోభన్‌బాబును కురిచేడుకు పంపారు. సమస్యను పరిష్కరించి రావాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు కురిచేడు వచ్చిన డీఎల్‌పీఓ శోభన్‌బాబు పంచాయతీలో ఉన్న నిధుల వివరాలు తెలుసుకున్నారు. స్వీపర్లకు ఇవ్వాల్సిన బకాయిల వివరాలు తెలుసుకున్నారు. స్వీపర్లకు 10 నెలల జీతాలు బకాయి ఉన్నట్లు తెలుసుకుని పంచాయతీలో ఉన్న నాలుగు లక్షల రూపాయలు వెంటనే వారికి జీతాల కింద విడుదల చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిల జాబితా తీసుకుని జిల్లా అధికారులతో మాట్లాడి వాటిని జమ చేయించి నెలాఖరులోపు మళ్లీ జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరో రెండు నెలల్లో అన్ని బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెండు నెలల్లో రిటైర్డ్ స్వీపర్ కంభంపాటి కోటయ్యకు పింఛన్ వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వీపర్లు, సీఐటీయూ నాయకుడు సందు వెంకటేశ్వరరావులు సమ్మె విరమించినట్లు ప్రకటించారు. ఇన్‌చార్జి ఈఓఆర్డీ నరేష్ కుమార్, కార్యదర్శి చాంద్‌బీ పాల్గొన్నారు.

వైవీని కలిసిన డాక్టర్ వెంకటరెడ్డి



వైవీ సుబ్బారెడ్డితో డాక్టర్ వెంకటరెడ్డి

పొదిలి: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని రెడ్డి జేఏసీ డాక్టర్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ యత్రం వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

రూ.4.85 కోట్ల విద్యాదీవెన పంపిణీ

దర్శి: నియోజవకర్గంలో జగనన్న విద్యాదీవెన కింద రూ.4.85 కోట్లు విడుదలైనట్లు ఏఎస్‌డబ్ల్యూ ఎస్‌కే రాబియాబేగం తెలిపారు. స్థానిక ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో సోమవారం విద్యాదీవెన చెక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాబియా బేగం మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ ఆపై చదువులు చదువుతున్న 6613 మంది విద్యార్థుల 5979 తల్లుల బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమ చేశామని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వార్డెన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

త్రిపురాంతకం: మండలంలోని డీవీఎన్ కాలనీ వద్ద 300 లీటర్ల బెల్లం ఊటను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ధ్వంసం చేశారు. నిందితుడు మాట నాగశ్రీనును అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాసులు, రెహమాన్, రమేష్‌బాబు, సెబ్ సిబ్బంది చంద్రశేఖర్, బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలి



ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

తాళ్లూరు: విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఏబీసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏబీసీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పరీక్షల భయాన్ని విద్యార్థులు మూడ్, అండర్ స్టాండింగ్, రీ రీడింగ్, డిఫికల్ట్, ఎఫెక్ట్, రివ్యూ ద్వారా అధిగమించాలని కోరారు. విద్యార్థులు తమ వైఖరి, బిలీఫ్, ఆత్మవిశ్వాసం, సంకల్పం, కృషితో విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. డైరెక్టర్ కాలేషాబు మాట్లాడుతూ ఏకాగ్రత, సమయపాలన పాటించటం ద్వారా, ఉపాధ్యాయుల మాటలు ప్రేరణగా, తల్లిదండ్రుల కష్టం స్ఫూర్తిగా ముందుకు సాగాలని చెప్పారు. ఎస్ఏలు యలమందరావు, కొండలరావు, సుబ్బయ్య, హిందీ పండిట్ చిన్నయ్యలు పరీక్షల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. 9వ తరగతి విద్యార్థులు ఘనంగా పది విద్యార్థులకు వీడ్కోలు చెప్పారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న పీఎల్‌పీ యాదవ్

మార్కాపురం: శ్రీ వేనూతల కాటంరాజు గంగా భవాని తిరునాళ్ల మంగళవారం ఉదయం ఉంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. 15 మంది కమిటీ సభ్యులతో ఏర్పాట్లు చేస్తున్నామని, ఆలయ పరిసరాల్లో తాగు నీరు, తాత్కాలిక బాత్‌రూమ్‌ల ఏర్పాటు, విద్యుత్ దీపాల అలంకరణ, భక్తులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. తిరునాళ్ల సందర్భంగా కొలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మార్కాపురం, గిద్దలూరు డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతోందన్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీసులకు అందరం సహకరిస్తామన్నారు. శానిటేషన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులు పోలీసులకు, తమ కమిటీకి సహకరించాలని, విరాళాలు కమిటీ సభ్యులకు ఇచ్చి రసీదు పొందాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు బుర్రి చిన్నవెంకటేశ్వర్లు, ముప్వా వెంకటేశ్వర్లు, శరబయ్య, నాగం రామకృష్ణ, చక్రపాణి, వెంకటేశ్, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలపై దాడికి ఖండన

తర్లుపాడు: శాసన సభలో సోమవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తదితరులపై టీడీపీ ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామి దాడి చేయడాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. చరిత్రలో బ్లాక్‌డేగా అభివర్ణించారు. అధికారం కొల్పోయామన్న అక్కసుతో శాసన సభలో ఎమ్మెల్యేలపై దాడులు చేస్తున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు.

జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ నీరు



సర్టిఫికెట్ అందిస్తున్న ఏఈ నారాయణస్వామి

కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో హర్ ఘర్ జల్ (జల జీవన్ మిషన్) పథకం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణస్వామి అన్నారు. సోమవారం మండలంలోని మునగపాడు పంచాయతీ ముమ్మాయపాలెం, వాగుమడుగు పంచాయతీ బోడపాడు గ్రామాల్లో ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా జేజేఎం, ఐఎస్ఏ నారాయణ సేవా సంస్థ ద్వారా వంద శాతం ఇంటింటికి కుళాయి కనెక్షన్ పనులు పూర్తి చేశామన్నారు. ఆ మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందించారు. ఇంటింటికి నీరు అందించటమే కాకుండా సురక్షితమైన తాగు నీరు ప్రజలకు అందిస్తామని నారాయణస్వామి అన్నారు. సర్పంచ్ సిద్దానబీ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శంకర్, వెంకటేశ్వర్లు, సాయి పాల్గొన్నారు.

254 పొగాకు బేళ్ల కొనుగోలు

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో 254 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. మొత్తం 303 బేళ్లను రైతులు వేలంలో ఉంచారు. వాటిలో 49 బేళ్లను తిరస్కరించిన వ్యాపారులు 254 బేళ్లను కొనుగోలు చేశారు. కనిష్ట ధర రూ.185లు కాగా గరిష్ట ధర రూ.200లు, సగటు ధర రూ.197.15లుగా వచ్చింది.

ప్రజలను అప్రమత్తం చేయాలి

మార్కాపురం టౌన్: గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసులు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ అక్రమాలు, లోన్ యాప్‌ల మోసాలపై ప్రజలతో సమావేశం చేసి మోసపోకుండా అలర్ట్ చేయాలని సీఐ భీమానాయక్ సూచించారు. సోమవారం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌లో మహిళా పోలీసులతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై మాట్లాడారు. కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించి దిశ యాప్ డౌన్‌లోడ్, పోలీస్ నంబర్లు ఇవ్వాలని, అవసరమైనప్పుడు వాటిని ఎలా ఉపయోగించుకోవాలో చెప్పాలని సూచించారు. రూరల్ యస్ఐ సుమన్ పాల్గొన్నారు

భవిత కేంద్రాలను వినియోగించుకోవాలి

త్రిపురాంతకం: భవిత కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ సూచించారు. సోమవారం త్రిపురాంతకంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. భవిత కేంద్రానికి క్రమం తప్పకుండా చిన్నారులను తీసుకువచ్చి సేవలు పొందాలని చెప్పారు. చిన్నారుల తల్లిదండ్రులకు సలహాలు అందించారు. ఫిజియోథెరపిస్ట్ అంకారావు, ఐఈఆర్‌టీ బాలవిజయ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం



లోగోను ఆవిష్కరిస్తున్న హనుమారెడ్డి

మార్కాపురం టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇందిరా ఇన్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు కళాశాల చైర్మన్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు, సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు వెన్నా హనుమారెడ్డి చెప్పారు. సోమవారం కళాశాలలో స్టూడెంట్స్ అసోసియేషన్‌లను డిపార్ట్‌మెంట్ల వారీగా ఏర్పాటు చేసి లోగోలను ఆవిష్కరించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు త్వరలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు ప్రోత్సహిస్తునట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, హెచ్‌ఓడీలు రాజశేఖర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆదినారాయణరెడ్డి, అబ్దుల్ కలాం, సత్యవాణి, సాయిబాబా, పుష్పాలత పాల్గొన్నారు.

వరల్డ్ ఓరల్ హెల్త్ డే ర్యాలీ

పొదిలి: స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. బీ ప్రౌడ్ టు యువర్ మౌత్ అనే నినాదంతో చేపట్టిన ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి ప్రారంభించారు. పొగాకు, దాని సంబంధిత పదార్థాలు వాడితే కలిగే అనర్థాల గురించి వివరించారు. వైద్యశాల నుంచి ప్రధాన రహదారిలో పెద్ద బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత వైద్యురాలు డాక్టర్ బాసంతి దాస్ పళ్లను, నోటిని శుభ్ర పరుచుకునే విధానాల గురించి వివరించారు. వైద్యశాలలో వృద్ధులకు నోటి సంబంధిత వ్యాధులు గుర్తించేందుకు స్క్రీనింగ్ క్యాంప్ జరిగింది. డాక్టర్ సీహెచ్ అఖిల్ రెడ్డి, డాక్టర్ రఫీ, డాక్టర్ హరీష్ పాల్గొన్నారు.

నోటి క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: నోటి క్యాన్సర్, దంత పరీక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఓరల్ హెల్త్ డేను పురస్కరించుకొని, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పొగాకు, గుట్కా తదితర పదార్థులు వాడితే నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలని సూచించారు. రోజూ దంతాలను ఉదయం, రాత్రి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. పొగాకు సంబంధిత ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా మానేయాలన్నారు. ర్యాలీలో డాక్టర్లు శ్రీహరిరెడ్డి, చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు క్యాన్సర్‌కు కారకం

దర్శి: పొగాకు నమిలినా, పొగ పీల్చినా క్యాన్సర్, గుండెజబ్బులు వస్తాయని దంత వైద్యులు మోహన్‌శివకుమార్ అన్నారు. వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం డ్రైవర్‌లు, బేల్దారి మేస్త్రీలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించి వృద్ధులకు దంత, నోటి పరీక్షలు చేశారు. నోటి క్యాన్సర్‌పై అవగాహ కల్పించారు. పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు. మోహన్‌శివకుమార్ మాట్లాడుతూ మారక ద్రవ్యాలకు దూరంగా ఉంటే వ్యాధులు దరి చేరవన్నారు. దంతాలు శుభ్రంగా ఉంచుకోక పోవడంతో కూడా ఎక్కువ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వైద్యులు గౌసియా, సిబ్బంది పాల్గొన్నారు.

కంభంలో వైద్య సిబ్బంది ర్యాలీ

కంభం: వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకుని సోమవారం వైద్యసిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల దంత వైద్యురాలు డాక్టర్ హారతి భూషణ్ దంత సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దంత సమస్యలు, పంటిగార, పిప్పి పళ్లు, ఇతర సమస్యలకు ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్యం చేసి మందులివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డా.విజయ్ చందర్, హెడ్ నర్స్ పద్మావతి, సామాజిక ఆరోగ్య అధికారి హబీబ్‌ఖాన్, వైద్యసిబ్బంది రవీంద్రబాబు, వెంకటమ్మ, మాధవి, ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్తయిన నాయుడుపేట రోడ్డు పనులు

- రూ.60 లక్షలతో 2 కిమీ రోడ్డు నిర్మాణం

కొనకనమిట్ల: నాయుడుపేట రోడ్డుకు మహర్దశ పట్టింది. గొట్లగట్టు-నాయుడుపేట రోడ్డు కొన్నేళ్లుగా అధ్వానంగా ఉండి ప్రయాణానికి నరకంగా మారింది. అడుగడుగునా గుంతలమయంగా మారిన రోడ్డున ప్రయాణం చేయాల్సి దుస్థితి. గత ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధి చేయాలని మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక కొన్ని పర్యాయాలు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి నాయుడుపేట ప్రజలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కేపీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు తనవంతు కృషి చేశారు. నాయుడుపేట నుంచి గొట్లగట్టు వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డులో మొదటి దశలో నాయుడుపేట నుంచి ఎస్సీ కాలనీ వరకు గల 2 కిమీ రోడ్డును కొత్తగా తారు రోడ్డు నిర్మించేందుకు జెడ్పీ నిధులు రూ.60 లక్షలు మంజూరు చేయించారు. ఆ మేరకు తారు రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఎప్పుడెప్పుడు రోడ్డు అభివృద్ధి చెందుతుందా అని ఎదురు చూస్తున్న ప్రజలకు రోడ్డు నిర్మాణం చేట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.